నిర్మాణంలో నాణ్యతా లోపం

- ముణ్నాళ్లకే కూలిన సీసీ డ్రైనేజీ
- ఏడాది కావస్తున్నా పట్టించుకోని అధికారులు
- ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో అయినా మోక్షం లభించేనా?

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో నిర్మించిన సీసీ డ్రైనేజీ మూడ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఆ సీసీ డ్రైనేజీ కట్టిన కొన్ని రోజులకే కూలిపోయింది. కాని ఇప్పటికీ అధికారులు ఎవరు పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రత్యేక పాలనలోనైనా ఆ సీసీ డ్రైనేజీకి మోక్షం లభిస్తుందని గ్రామస్తులు ఆశపడుతున్నారు. జీపీ నిధులతో గ్రామాల్లో పలు సీసీ డ్రైనేజీలను నిర్మించారు. సహకారం సఘం రోడ్డు పక్కన సీసీ డ్రైనేజీ నిర్మించారు. భారీ వర్షాల వల్ల డ్రైనేజీ నేల మట్టం అయింది. దీంతో మురికి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. స్థానిక ప్రజా ప్రతినిధులే కాంట్రాక్టర్లుగా అవతరామెత్తి పనులు చేపడితే ఇంతే ఉంటదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ప్రత్యేక పారిశుద్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వాటిలోనైన కూలిన డ్రైనేజీని తెరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిర్మించిన కాంట్రాక్టర్ చేతనే మళ్లీ సీసీ డ్రైనేజీని నిర్మించే వరకు బిల్లులు చెల్లించవద్దని డిమాండ్ చేస్తున్నారు. బిల్లులు చెల్లించినట్లు అయితే ఉన్నత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ముప్కాల్ మండలం రెంజర్లలో కూలిన డ్రైనేజీ

సీసీ రోడ్డు సంగతి అంతే..

సహకార సంఘం వైపు వెళ్లే రోడ్డుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షతో నిర్మించారు. సిమెంట్ లేని సీసీ రోడ్డులా మారింది. ఇప్పుడే కాంక్రీట్ తేలింది. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకున్న అధికారులు పట్టించుకోలేదు. అధికార పార్టీకి చెందిన నాయకులే కాంట్రాక్టర్లుగా మారి రోడ్లు వేయడంతో పలు గ్రామాల్లో ఇదే దుస్థితి ఏర్పడింది. ఉన్నత అధికారులు స్పందించి ప్రత్యేక పాలనలోనైనా మరమ్మతులు చేపట్టాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

సీసీ డ్రైయినేజీ కూలిన విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ప్రత్యేక పారిశుదద్య వారోత్సవాల్లో మొదటి రోజు ప్రత్యేకాదికారి కూడ పరిశీలించారు. త్వరలోనే పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, రెంజర్ల

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వకులాభరణం వెంకటేశ్వర్ అన్నారు. కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి న్యాయమూర్తి వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. న్యాయవాది గటడి ఆనంద్, పీఆర్టీయూ నాయకులు ఇట్టం గోపాల్, హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మెజిస్ట్రేట్

పంచాయతీ భూములను కాపాడాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న జీపీ భూములను కాపాడాలంటూ డొంకేశ్వర్ గ్రామస్తులు(సర్వ సమాజ్ కమిటీ) తహసీల్ కార్యాలయం ముందు శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూకబ్జాలపై అధికారులు పట్టించుకోకపోవడంతోనే తాము నిరాహార దీక్షలకు దిగినట్లు తెలిపారు. వెంటనే స్పందించి పంచాయతీకి సంబంధించిన భూములకు ఫెన్సింగ్ వేయాలని, లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షలు కూడా చేస్తామన్నారు. ఈ విషయమై తహశీల్దార్ రాములు, పంచాయతీ కార్యదర్శి శేఖర్ గౌడ్‌ను పిలిపించుకుని మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న పరిస్థితిపై ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లోటస్ స్మార్ట్ స్కూల్‌లో శనివారం ఆర్మూర్ మండల ప్రైవేట్ స్కూల్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భరతచంద్ర మల్లయ్య, కార్యదర్శిగా విద్య ప్రవీణ్ పవార్, కోశాధికారిగా స్కాలర్స్ వేణు ఏకగ్రీవంగా ఎన్నికై య్యారు. ఎన్నికై న అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. ఆర్మూర్ మండలంలో ప్రైవేట్ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తామని, విద్యా ప్రమాణాల స్థాయి పెంపునకు కృషి చేస్తామన్నారు. భాషిత సుందర్, కాంతి గంగారెడ్డి, మానస గణేష్, భార్గవి గోపి కృష్ణ, నలంద ప్రసాద్, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. నూతన ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో కిడ్నాప్ ఉదంతాల మీద పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో గుణవంత్‌రావును కలిసి పాఠశాలలకు రక్షణగా ఉండాలని వినతి పత్రం అందజేశారు.



పీవీకి ‘భారత రత్న’ను స్వాగతిస్తున్నాం

కమ్మర్‌పల్లి: భారత మాజీ ప్రధానులు పీవీ నరసింహారావుతో పాటు, చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలో అనేక లోపాలున్నాయని, వాటిని సరి చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ చేసిన సిఫారసులను పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత అన్వేష్ రెడ్డి

సమాచారం..

■ రేపు మండల సర్వసభ్య సమావేశం

నవీపేట: ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ శనివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు.

■ 22 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

మాక్లూర్: పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్ పర్సన్ అమృతలత శనివారం తెలిపారు. అడవి మామిడిపల్లి శివారులోగల అపురూప వేంకటేశ్వర ఆలయంలోని కల్యాణ మండపంలో రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 5 వరకు కొనసాగుతాయని తెలిపారు. కళా ప్రదర్శనలు ఇచ్చే వారు వారి పేర్లను నమోదు చేసుకోవాలని అమృతలత కోరారు.

వదంతులు నమ్మవద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కిడ్నాప్‌లు, సైబర్ క్రైంలపై విద్యార్థులకు బోధన్ సీఐ నరేష్, ఎడపల్లి ఎస్సై విక్రమ్ అవగాహన కల్పించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తె/మీ)లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు గాని ఇంకెవరైనా గానీ వదంతులు నమ్మకూడదని, అపరిచిత వ్యక్తులపై అనుమానం ఉంటే 100 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే బ్యాంక్ ఖాతా వివరాలు తెలియని వారికి ఇవ్వవద్దని సూచించారు.

పోచారం జన్మదిన వేడుకలు


క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

రుద్రూర్: కోటగిరి, పోతంగల్, రుద్రూర్, వర్ని, మోస్రా, చందూర్ మండలాల్లో శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్యేగా పదవులకే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వన్నె తెచ్చారని అన్నారు. ఆయన హయాంలో బాన్సువాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. జలాల్‌పూర్‌లో అభిమానులు నిర్వహిస్తున్న పీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

క్లుప్తంగా

ఒకే రోజు నలుగురు యువతుల అదృశ్యం

మాక్లూర్: మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన 19 సంవత్సరాల లోపు వయస్సు గల నలుగురు యువతులు అదృశ్యమైనట్లు తల్లిదండ్రుల నుంచి వేర్వేరుగా ఫిర్యాదులు అందాయని ఎస్సై సుధీర్ రావు శనివారం తెలిపారు. కల్లెడిలో ఇద్దరు, చిక్లీలో ఒకరు, మాణిక్‌భండార్‌తండాలో ఒకరు మొత్తం నలుగురు యువతులు అదృశ్యమయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ప్రస్తుతం రోజూ వినిస్తున్న కిడ్నాపులకు, ఈ నలుగురు యువతుల అదృశ్యానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

అర్హుల వివరాల నమోదు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హుల వివరాలను శనివారం విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డులను పరిశీలించారు. లైన్‌మెన్లు శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు

రుద్రూర్: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శనివారం విద్యా శాఖ ఆధ్వర్యంలో 8, 9 తరగతి విద్యార్థులకు స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. డ్రామా విభాగంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు, స్పెల్ విజార్డులో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యార్థి ఆంగ్ల భాష పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ శంకర్, ఉపాధ్యాయులు రామాగౌడ్, పద్మ, సుమలత, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

పీడీఎస్ బియ్యం వేలం

బోధన్‌రూరల్(బోధన్): అధికారుల తనిఖీల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో వేలం నిర్వహించినట్లు బోధన్ తహసీల్దార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం 416 క్వింటాల 60 కిలోల పీడీఎస్ బియ్యానికి వేలం నిర్వహించి వేలంలో పాల్గొన్న వారు అందించిన ధరను రికార్డు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

బోధన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలోని యూనియన్ ఆఫీసులో గ్రామీణ భారత్ బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ వనరులను బీజేపీ, కార్పొరేట్ సంస్థల పరం చేస్తోందన్నారు. నాయకులు సురేష్, సాయాగౌడ్, పేట సాయిలు ఉన్నారు.

నవీపేటలో..

నవీపేట: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడీ శ్రీనివాస్ కోరారు. కార్మికుల శ్రేయస్సుకు దోహదం చేసే చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తేవడం సరైంది కాదన్నారు. దేశవ్యాప్త సమ్మెకు బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు మద్దతు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నాయకులు పోశెట్టి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్: సుంకెట్ గ్రామానికి చెందిన నర్సు మోకాలి నొప్పితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుంది. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఆమె చికిత్సకయ్యే ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎల్‌వోసీని మంజూరు చేయించి బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి ఇప్పించారు. దీంతో సునీల్‌రెడ్డికి నర్సు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డొంకేశ్వర్ తహసీల్దార్ బదిలీ

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ తహసీల్దార్ రాములు బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా నుంచి వచ్చిన ఈయన డొంకేశ్వర్‌లో ఐదు నెలలుగా తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఎన్నికల పూర్తయిన నేపథ్యంలో రాములును బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాలోనే డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు సివిల్స్ సర్వీసెస్ లాంటి అత్యున్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్ అన్నారు. పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో శనివారం విజేత డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గంటా చంద్రశేఖర్ మాట్లా డారు. ఎస్సై గంగాధర్ కళాశాల కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్ పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులకు నిధులివ్వండి



మోర్తాడ్: మోర్తాడ్ ముసలమ్మ చెరువు తూం సరిగా లేకపోవడం, పంట కాలువ డ్రైనేజీ కాలువగా మారడంతో అనేక ఇళ్లలోకి వర్షాలు కురిసిన సమయంలో నీరు వస్తోందని, మరమ్మతుల కోసం నిధులు ఇవ్వాలని బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసిన సునీల్‌రెడ్డి ముసలమ్మ చెరువు మరమ్మతుల గురించి విన్నవించారు.

ప్రజారంజక బడ్జెట్

పెర్కిట్(ఆర్మూర్): అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆలూర్ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు వైఎస్ మల్లారెడ్డి, ఉదయ్, ముత్యం, నవనీత్, గంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

నవీపేట: మండల కేంద్రంలోని ధర్యాపూర్ కాలనీలోని లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో శనివారం ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆలయంలోని దేవతామూర్తులకు జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తెడ్డు పోశెట్టి, ధర్యాపూర్ యూత్ ప్రతినిధులు దేవరాజ్, నరేష్, బబ్లూ, సుమన్, గణేష్, చింటు, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్‌లో ఫుడ్ సైన్స్ కాలేజీ విద్యార్థి ప్రతిభ


బాలకృష్ణ

రుద్రూర్: రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల విద్యార్థి భూక్యా బాలకృష్ణ పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. అశ్వారావ్‌పేట వ్యవసాయ కళాశాలలో ఇటీవల అంతర కళాశాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు హాజరై బాలకృష్ణ రన్నింగ్ విభాగంలోని అన్నింటిలో ప్రతిభ చూపాడు. 400 మీటర్లు, 800 వందల మీటర్లు, 1500 మీటర్లు, 3 వేల మీటర్లలో ప్రథమ బహుమతి అందుకున్నట్టు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కల్పన వెల్లడించారు.

అగ్గిమల్లన్న జాతర ప్రారంభం

డొంకేశ్వర్(ఆర్మూర్): జీజీ నడ్కుడలో అగ్గి మల్లన్న స్వామి జాతర శనివారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరలో మొదటి రోజు స్వామివారి కల్యాణం, అన్నదానం నిర్వహించారు. 11న అమ్మవారి బోనాలు, 12న రథోత్సవం, 13న నైవేద్యాలు, చివరి రోజు 14న అగ్నిగుండం కార్యక్రమం ఉండనుంది.

శివలింగ్ శివాచార్య పాదుకల ప్రచార రథయాత్ర

బోధన్: మహారాష్ట్ర ప్రాంతం అహ్మద్‌పూర్‌కు చెందిన వీరశైవుల ఆరాధ్యదైవం డాక్టర్ శివలింగ్ శివాచార్య మహరాజ్ సంజీవన్ సమాధిపై భవ్య శివలింగ స్థాపన కార్యక్రమం ఈ నెల 23 నుంచి 25 వరకు ఆ ప్రాంతంలోని వారి భక్తి స్థలిలో జరుగనుంది. ఈ నేపథ్యంలో శివలింగ్ శివాచార్య మహరాజ్ పాదుకలు, శివలింగంతో ఉన్న ప్రచార రథయాత్ర శనివారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని ఏకచక్రేశ్వరాలయం వద్ద ప్రారంభించారు. రథయాత్రకు వీరశైవ సమాజ్ మహిళలు, ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వాగతం పలికారు. ఆలయం నుంచి బోధన్, సాలూర, కోటగిరి మండలంలోని వీరశైవులు అధికంగా ఉండే గ్రామాలైన సాలూర, ఖాజాపూర్, హున్స, కొల్లూరు, సుంకిని గ్రామాల్లో రథయాత్ర కొనసాగింది. వీరశైవులు ఘన స్వాగతం పలికారు. ఏకచక్రేశ్వరాలయం కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, వీరశైవ జంగము, లింగాయత్ సమాజ్ ప్రతినిధులు మల్లికార్జున్ అప్ప, బాబయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న వీరశైవ మహిళలు, సమాజ్ ప్రతినిధులు

ధైర్యమే విజయానికి మెట్టు


మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్


డాన్స్ చేస్తున్న కళాశాల విద్యార్థులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టుదల, ధైర్యంతో ముందుకు సాగితేనే విజయమనే మెట్టును చేరుకోవచ్చని డీఐఈవో రఘురాజ్ అన్నారు. బోధన్ పట్టణంలోని విజయ సాయి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐఈవో హాజరై జ్యోతిని వెలిగించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలో నిరంతర శ్రమ, కృషి ఉంటే విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల డాన్సులు, పాటలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో నాగ్‌నాథ్, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావ్ పాల్గొన్నారు.

మానవ జీవన విధానాన్ని తెలియజేస్తుంది

బోధన్‌టౌన్(బోధన్): రామాయణం ద్వారా మానవుడి జీవన విధానం తెలుస్తుందని విరించి ఆస్పత్రి ఎండీ మాధవీలత అన్నారు. శనివారం పట్టణంలోని విజయ సాయి ఉన్నత, నారాయణ పాఠశాలల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. గత యేడాది 10/10 జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులను సన్మానించి రూ.2,700 నగదు అందజేశారు. విద్యార్థుల డాన్సులు, పాటలు అలరించాయి. ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, ఐఆర్ చక్రవర్తి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవీలత.. పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో డాన్స్ చేస్తున్న విద్యార్థులు

జోయలుక్కాస్ జువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం


ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వినీత

సాక్షిప్రతినిధి, నిజామాబాద్: ఆర్మూర్ పట్టణంలో మూడు రోజుల పాటు జరిగే జోయలుక్కాస్ జువెలరీ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పండిత్ వినీత ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణ ప్రజలు ఈ జువెలరీ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జోయలుక్కాస్ తెలంగాణ రీజినల్ మేనేజర్ రాబిన్ తంబీ, బ్రాంచ్ ఇన్‌చార్జి వినయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

మాక్లూర్: పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా శనివారం ముత్యంపల్లిలో జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై చెత్తాచెదారంపై అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి జె ముత్తెన్న, ఎంపీడీవో క్రాంతి, ఎంపీటీసీ కోటగిరి లక్ష్మి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ రేకుల షెడ్డు పనులు ప్రారంభం



బోధన్: సాలూర మండల కేంద్రం శివారులోని ఒంటి హనుమాన్ మందిరం వద్ద కమ్యూనిటీ హాల్ రేకుల షెడ్డు నిర్మాణానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.4 లక్షలు మంజూరు చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో మండల తహసీల్దార్ మల్లేశం, ఎంపీపీ బుద్దె సావిత్రి పనులు ప్రారంభించారు.

అందుబాటులో కేంద్ర ప్రభుత్వ పథకాలు

మాక్లూర్: ప్రజలకు అందుబాటులో కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నాయని వాటికి అర్హులైన ప్రజలు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని బీజేపీ మండల నాయకుడు తొడు మహేష్ అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం రాంచంద్రపల్లిలో జరిగిన కార్యక్రమానికి మహేష్ హాజరయ్యారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి మోదీ పథకాలను వివరించి చెబుతూ కరపత్రాలను పంచి పెట్టారు. బీజేపీ నాయకులు సురేష్, వినోద్, పుల్లయ్య, మహేష్, తదితరులుపాల్గొన్నారు.

నేడు కోటగిరిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేనం(1960–61 నుంచి 2000–01), స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 2000 సంవత్సరంలోపు చదువుకున్న విద్యార్థులతో కోటగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – కెమెరామెన్ (తెలుగు) - 2.45
హనుమాన్ (తెలుగు) - 6.00
తేరి బాతోమే (హిందీ) - 9.20

స్క్రీన్-2 – ఈగల్ (తెలుగు) - 11.20, 02.40, 6.00, 9.20

స్క్రీన్-3 – ఈగల్ (తెలుగు) - 10.10 యాత్ర-2 1.30, 4.25, 7.20, 10.15

స్క్రీన్-4 – యాత్ర-2 (తెలుగు) - 10.05
తేరి బాతోమే (హిందీ) - 4.15

వైజ్ఞానిక ప్రదర్శనలతోనే సృజనాత్మకత

పెర్కిట్(ఆర్మూర్): వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులతో పాటు సృజనాత్మకత పెరుగుతుందని విజయ్ విద్యా సంస్థల అధినేత్రి డాక్టర్ అమృతలత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను అమృతలత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలు అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కవితా దివాకర్, ఉపాధ్యాయులు ఎస్తేర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

